ప్రజాజ్యోతి
కరీంనగర్
రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి
శుక్రవారం 5, జూన్ 2026 www.prajajyothinews.com పేజీలు :10

# ఏసీబీ వలలో ఎఫ్ఆర్ఓ

## - 80 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న - ఏ సి బి అధికారులు



కొడిమ్యాల,జూన్ 04,(ప్రజాజ్యోతి): మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మొహినుద్దీన్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. బాధితుడి నుంచి రూ.80 వేల లంచం తీసుకుంటుండగా కరీంనగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ నేతృత్వంలోని బృందం బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఏసీబీ కథనం ప్రకారం.. 120 టేకు చెట్ల నరికివేతకు అనుమతి, రవాణా పర్మిట్ జారీ కోసం తొలుత రూ.2 లక్షలు డిమాండ్ చేసిన అధికారి, ఇప్పటికే రూ.1 లక్ష తీసుకున్నట్లు గుర్తించారు. మిగిలిన మొత్తాన్ని రూ.80 వేలకు తగ్గించి స్వీకరిస్తుండగా అధికారులు రంగంలోకి దిగారు.దాడి సమయంలో అధికారి టేబుల్ డ్రాయర్‌లో ఉన్న రూ.80 వేల లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



## క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం

# విజయానికి మూలం

### – మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ – కరీంనగర్‌లో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం

కరీంనగర్ టౌన్ జూన్ 4 (ప్రజా జ్యోతి ) దేశంలో ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు ,రేకుర్తిలోని ఎలైట్ హోటల్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరీంనగర్‌లో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శక

## బీర్‌పూర్ గ్రామసభలో

# బాగోతం

### - ప్రజా సమస్యలు గాల్లోకి.. ఫోన్ గేమ్స్‌లో మునిగిన ఇరిగేషన్ ఏఈ!





ప్రజా సమస్యల పరిష్కార వేదికైన గ్రామసభలు కొందరు అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో జరిగిన అధికా రిక గ్రామసభలో ఓ ప్రభుత్వ అధికారి ప్రవర్తించినతీరుతీవ్రవిస్మయానికిగురిచేస్తో ంది. సభలో స్థానిక సమస్యలపై తీవ్రంగా చర్చ జరుగుతుండగా.. బాధ్యతాయ ుతమై న పదవిలో ఉన్న ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ఎండీ వాసిం మాత్రం వేదికపైనే ఫోన్ గేమ్స్‌లో మునిగిపోయి మా ప్రతినిధి కెమెరాకు అడ్డంగా దొరికిపోయారు.సమస్యల సభలో 'గేమ్స్' సోయిగ్రామ అభివృద్ధి, సాగునీటి ఇబ్బం దులు, ఇతర మౌలిక వసతులపై చర్చించేందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలతో ఈ సభ ఏర్పాటయింది. సభలో ఒకవైపు సమస్యలపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. అయి తే, ప్రజా సమస్యలను నోట్ చేసుకుని పరిష్కరించాల్సిన ఇరిగేషన్ ఏఈ వాసిం.. అవేమీ పట్టనట్టు తన మొబైల్ స్క్రీన్‌పై చేతులు ఆడిస్తూ గేమ్స్ ఆడటంలో లీనమైపోయారు. బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగంలో ఉండి, అధికారిక సమావేశంలో ఇలా గేమ్స్ ఆడటం సదరు అధికారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.కెమెరాకు చిక్కిన నిర్లక్ష్యం సభ జరుగుతున్నంతసేపూ ఫోన్ లోనే మునిగిపోయిన ఏఈ వాసిం వైనాన్ని మా ప్రతినిధి తన కెమెరాలో ప్రత్యక్షంగా రికార్డ్ చేశారు. ప్రజల సమస్యల పట్ల కొందరు అధికారులకు ఉన్న నిర్లక్ష్యానికి ఈ దృశ్యాలే సజీవ సాక్ష్యంగా నిలుస్తున్నాయి. విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన ఏఈ వాసింపై ఉన్నతాధికా రులు ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి

## ప్రజాజ్యోతి కథనానికి స్పందన



## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



# క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం విజయానికి మూలం

**– మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ**

**– కరీంనగర్‌లో 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్' ప్రారంభం**




**కరీంనగర్ టౌన్ జూన్ 4 (ప్రజా జ్యోతి )** దేశంలో ఐఐటీ–జేఈఈ, నీట్ శిక్షణలో అగ్రగామిగా ఉన్న రెసోనెన్స్ విద్యాసంస్థలు ,రేకుర్తిలోని ఎలైట్ హోటల్ వేదికగా 'రెసోనెన్స్ ఫౌండేషన్ సెంటర్'ను ప్రారంభించింది. మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాది నిర్మించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరీంనగర్‌లో ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్న రెసోనెన్స్ విద్యా సంస్థలను అభినందించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థుల కు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో కూడిన అభ్యాసం, స్పష్టమైన అవగాహన, సరైన మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తు విజయాలకు కీలకమన్నారు. విద్యార్థులు చిన్నవయస్సులోనే క్రమబద్ధమైన విద్యా శిక్షణ ద్వారా భవిష్యత్తు పోటీ పరీక్షలకు బలమైన పునాదిని ఏర్పరచుకోవచ్చని తెలిపారు. ఈ ఫౌండేషన్ కోర్సు ద్వారా విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, మెంటల్ ఎబిలిటీ అంశాల్లో సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ అంశాలపై ప్రారంభ దశలోనే బలమైన పట్టు సాధించడం ద్వారా విద్యార్థులు భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించుకోగలరని చెప్పారు. దీంతో ఇంటర్ అనంతరం ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి పోటీ ప్రవేశ పరీక్షలలో సులభంగా విజయం సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రెసోనెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు నర్రా మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమబద్ధమైన బోధనా పద్ధతులు, నిరంతర విద్యా పర్యవేక్షణతో ఫలితాల ఆధారిత విద్యను అందించడానికి రెసోనెన్స్ కట్టుబడి ఉందన్నారు. ఈ ఫౌండేషన్ సెంటర్ విద్యార్థులకు ప్రాథమికాంశాలను బలోపేతం చేసుకోవడా నికి, ఐఐటీ–జేఈఈ, నీట్, ఒలింపియాడ్స్ వంటి పోటీ పరీక్షలకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమవడానికి సహాయపడుతుందని తెలిపారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రారంభ దశలోనే ప్రిపరేషన్ మొదలుపెట్టడం, సంపూర్ణ అవగాహనతో కూడిన అభ్యాస ం, కెరీర్ ఆధారిత విద్యా ప్రణాళిక ప్రాముఖ్యతను వివరించారు. రెసోనెన్స్ విద్యాసంస్థలు, తెలంగాణ ఱ ఆంధ్రప్రదేశ్ గురించిరెసోనెన్స్ అనేది ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థి ఆర్కే వర్మ 2001లో రాజస్థాన్‌లోని కోటాలో స్థాపించారు. ఇది దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఒక ప్రతిష్టాత్మక విద్యాసంస్థ. గత రెండు దశాబ్దాలుగా రెసోనెన్స్ 87 నగరాల్లోని 150 పైగా కేంద్రాల ద్వారా 10 లక్షల (1 మిలియన్) పైగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. ఇందులో 3.3 లక్షల పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాల యాలు, టాప్ మెడికల్ కాలేజీలలో ప్రవేశాలు పొందారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ బలమైన వారసత్వంతో, పూర్ణచంద్రరావు నర్రా దూరదృష్టితో కూడిన నాయకత్వంలో రెసోనెన్స్ 2018లో హైదరాబాద్‌లో ఒకే ఒక్క క్యాంపస్‌తో ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ.. ఐఐటీ–జేఈఈ, నీట్, ఇతర పోటీ పరీక్షలకు సమగ్రమైన శిక్షణ, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్, ఫలితాల ఆధారిత విధానంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో నిరంతర విజయాలకు, విద్యా నైపుణ్యానికి రెసోనెన్స్ విద్యాసంస్థలు ఒక చిహ్నంగా మారాయి. కేవలం ఏడు సంవత్సరాలలోనే, రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 6,100 పైగా విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్, ఇతర అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో సీట్లు సాధించారు. ఈ అద్భుతమైన విజయాల స్ఫూర్తితో, రెసోనెన్స్ ఇప్పుడు ఫౌండేషన్ సెంటర్లు, పాఠశాలలు, ఈ–లెర్నింగ్, గ్లోబల్ స్టడీస్ రంగాలలోకి విస్తరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 50 పైగా క్యాంపస్‌లతో విజయవంతంగా దూసుకుపోతోంది. అని పేర్కొన్నారు

# నిట్టూరులో లాఠీచార్జ్ బాధితులకు దాసరి మనోహర్ రెడ్డి పరామర్శ



**పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 4 ప్రజా జ్యోతి;** పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామంలో ఇటీవల జరిగిన లాఠీచార్జ్ ఘటనలో గాయపడిన బాధితులను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి గురువారం పరామర్శించారు. నిట్టూరు సర్పంచ్ భర్త ఆకుల శ్రీనివాస్ నివాసంలో బాధితులను కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువు మట్టి రవాణా చేస్తున్న టిప్పర్లు అతివేగంగా వెళ్తుండటంపై గ్రామస్తులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. కరెంటు స్థంభాన్ని ఢీకొట్టిన లారీ ఘటన అనంతరం చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితుల్లో పోలీసులు సరైన విచారణ లేకుండానే గ్రామస్తులపై లాఠీచార్జ్ చేయడం ఖండనీయమన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవడం సమంజసమేనని, అయితే సంబంధం లేని సామాన్య ప్రజలపై బలప్రయోగం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఘటనపై గ్రామస్తులతో కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. నిట్టూరు గ్రామంలో అతివేగంగా వెళ్తున్న టిప్పర్ల వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, వాటి వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని దాసరి మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైదాపూర్‌లో మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



సైదాపూర్, జూన్ 4, (ప్రజా జ్యోతి) రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు, సైదాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాలకు చెందిన చెక్కుల పంపిణీ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ పాల్గొని, లబ్ధిదారులకు మొత్తం 42 మందికి మంజూరైన రూ. 42,04,872 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు సైదాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంత సుధాకర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఈ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు కొత్త తిరుపతిరెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వినోద్, ఎలా బోతారం సర్పంచ్ నమిండ్ల రవీందర్, పెరిక పల్లి సర్పంచ్ పోతరాజు బబిత, సైదాపూర్ సర్పంచ్ మునిగంటి స్వప్న, ఘన పూర్ సర్పంచ్ బాసరాజు రజిత, ఆరేపల్లి సర్పంచ్ వర్ని లావణ్య, దుద్దెనపల్లి సర్పంచ్ ఉడిగె విజయలక్ష్మి, సోమారం సర్పంచి కందుల అనిత, జి పి ఓ లు, లబ్ధిదారులు, కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరు.

## మండల ఇన్చార్జి విద్యాధికారి సిరిమల్ల మహేష్.



కాల్వ శ్రీరాంపూర్ జూన్ నాలుగు (ప్రజా జ్యోతి) కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. పెద్ద రాతుపల్లి. గంగారం. వెన్నంపల్లి. గ్రామాల్లో ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూ రైనట్లు మ ం డల విద్యాధికారి సిరి మల్ల మహేష్ గుర ు వారం రో జున తెలి పారు. ఇన్ సక్టర్లు. ఆ యా పోస్టులకు అర్హత కలిగిన వారు దరఖాస్తు లు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ దరఖాస్తులను పాఠశాల ప్రధానోపాధ్యాయులకు గాని. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు గాని సమర్పించాలని తెలిపారు.

# ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణి చేస్తున్న బెంద్రం.తిరుపతి రెడ్డి



**ఇల్లంతకుంట జూన్ 4 ( ప్ర జ జ్యో తి )** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేం ద్రం లోని బస్టాండ్ ఆవరణలో వచ్చే వేలాది మంది ప్రజలకు ఎండ తీవ్రత నుండి ఉపశమనం కలి గించేందుకు గురు వారం రోజున చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్న బి టి అర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బెంద్రం. తిరుపతి రెడ్డి మండల యువజన సంఘాల అధ్యక్షులు ఫౌండేషన్ సేవా ప్రతినిదులు యాళ్ళకి. శ్రీనివాస్, బాంగోని. శ్రీనివాస్ , గొడుగు. రాకేశ్ , గౌరవేణి. శ్రీనివాస్ , ముకేశ్ , వెంకట్ తదితరులు

## మంగళపల్లిగ్రామాన్నివేములవాడమండలం లోవిలీనంచేయాలి నిరసనబాటపట్టిన మంగళపల్లి వార్డు సభ్యుడు




వేములవాడ,జూన్,4:ప్రజాజ్యోతి వేములవాడ పట్టణంలో గురువారం రోజున కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామస్తుడు తమ గ్రామాన్ని వేములవాడ మండలంలో విలీనం చేయాలనే డిమాండ్‌తో నిరసన గళం విప్పారు. మంగళపల్లి గ్రామానికి చెందిన మూడో వార్డు సభ్యుడు ఉప్పుల జీవరత్నం వినూత్న రీతిలో తన నిరసనను వ్యక్తం చేశారు. గ్రామాన్ని వేములవాడ మండలంలో కలపాలన్న ప్రధాన డిమాండ్‌తో కూడిన ప్లకార్డులు, ఫ్లెక్సీలను శరీరానికి ధరించి ఆయన వేములవాడ కోరుట్ల బస్టాండ్ నుండి చెక్కపల్లి బస్టాండ్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళపల్లి గ్రా మం ప్రస్తుతం కోనరావుపేట మండలం లో ఉందని, అయితే మండల కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 17నుండి18 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన రవాణా సౌకర్యాలు లేక గ్రామస్తులు, విద్యార్థులు, వృద్ధులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. భౌగోళికంగా మంగళపల్లికి వేములవాడ పట్టణం ఎంతో దగ్గరగా ఉందని తెల్లవారుజాము నుంచే తమకు కావాల్సిన నిత్యావసరాలు, ఇతర అవసరాల కోసం తాము వేములవాడ పట్టణంపైనే ఆధార పడుతున్నామని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజల కష్టాలను గుర్తించి ప్రభుత్వం మంగళపల్లిని వేములవాడ మండలంలో విలీనం చేయాలని జీవరత్నం డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో పలువురు గ్రామస్తులు పాల్గొని తమ మద్దతు తెలిపారు

## యాదవ సంఘం రాష్ట్ర మండల నాయకు లకు సన్మానం



గంభీరావుపేట జూన్ 4 (ప్రజా జ్యోతి) గంభీరావుపేట మండలం ముస్తఫా నగర్ గ్రామానికి చెందిన కొక్కు దేవేందర్ యాదవ్ ( రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ) గంభీరావుపేట యాదవ సంఘం మండల అధ్యక్షులు దోమకొండ కృష్ణ కాంత్ యాదవ్ గంభీరావుపేట మండల యాదవ సంఘం అధ్యక్షులను ముస్తఫానగర్ యాదవ సంఘం ముస్తఫానగర్ అధ్యక్షులు కంటే వెంకటి మరియు సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, యాదవ జాతి సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని అన్నారు. గ్రామాలలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని యాదవ సంఘం సభ్యులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో స్వామి సుద్దాల రాజయ్య, సత్తయ్య , దోమకొండ మల్లేష్, హనుమయ్య, రాజలింగం, దోమకొండ శేఖర్, కొక్కు రాజయ్య, మధు, దేవేందర్, మారబోయిన కృష్ణమూర్తి, బాబు శ్రీనివాస్ తిరుపతి దేవయ్య, వెంకటి, లింగం, దేవయ్యలు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారిగా రంజిత్ కుమార్



పెద్దపల్లి ప్రతినిధి, జూన్ 4 ప్రజాజ్యోతి: పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ (ఆర్టీఏ) ఇన్‌చార్జి అధికారిగా రంజిత్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు జిల్లా రవాణా శాఖ అధికారిగా పనిచేసిన పి. రంగారావు వరంగల్ జిల్లాకు బదిలీ కావడంతో ఆ పదవి ఖాళీగా ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి స్థాయి జిల్లా రవాణా శాఖ అధికారిని నియమించకపోవడంతో, ఇటీవల పెద్దపల్లికి బదిలీపై వచ్చిన సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) రంజిత్ కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ, రవాణా శాఖ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్సుల జారీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, రోడ్డు భద్రత కార్యక్రమాల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యాలయ పనితీరును మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు భద్రతా నిబంధనల అమలు, అతివేగం, ఓవర్‌లోడింగ్, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. రవాణా శాఖకు సంబంధించిన సేవల కోసం వచ్చే ప్రజలు అవసరమైన పత్రాలతో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. రంజిత్ కుమార్ బాధ్యతల స్వీకరణ సందర్భంగా రవాణా శాఖ సిబ్బంది, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో రవాణా శాఖ సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పంటల మార్పిడితోనే రైతులకు అధిక లాభాలు

పెద్దపల్లి నియోజకవర్గంలో 98 శాతం వడ్ల కొనుగోళ్లు పూర్తి

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



సుల్తానాబాద్, జూన్ 4:( ప్రజా జ్యోతి) రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రైతులు పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇస్తూ పామాయిల్ వంటి లాభసాటి పంటల సాగు వైపు అడుగులు వేయాలని తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 2, 3, 4, 5 వార్డుల గ్రామసభలు స్థానిక ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల మార్పిడి చేపట్టాలని సూచించారు. పంటల మార్పిడి వల్ల భూసారం పెరిగి, దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. పామాయిల్, ఆరుతడి, ఇతర వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలని కోరారు. తాను కూడా మూడు ఎకరాల్లో పామాయిల్ తోటను సాగు చేయనున్నట్లు వెల్లడించారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 98 శాతం వడ్ల కొనుగోళ్లు పూర్తయ్యాయని, రైతులకు నిల్వ సమస్యలు లేకుండా ఎలిగేడు మండలంలో 1.70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాం నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. త్వరలోనే అన్ని మండలాల్లో గోదాముల నిర్మాణం చేపడతామని చెప్పారు. రైతులకు మేలు జరిగితే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని, రైతుల సమస్యలను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూస్తున్నాయని విమర్శించారు. గతంలో వడ్ల కొనుగోళ్లలో రైతులను నష్టపరిచిన వారే ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దపల్లి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ఆసుపత్రి ఇటీవల ఆరు అవార్డులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధా కృష్ణ మార్కెట్ కమిటీ చైర్మన్, తాసిల్దార్ బషీరుద్దీన్ మినుపాల ప్రకాష్ రావు సింగిల్ విండో చైర్మన్, శ్రీగిరి శ్రీనివాస్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి, , వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ శాస్త్రవేత్తలు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎన్పీడీసీఎల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు



## పల్లిమక్తలో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



కొనరావుపేట, జూన్.4(ప్రజాజ్యోతి)కొనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మోకన పెల్లి చందన బాలరాజు, చిత్రవేణి ప్రభాకర్, ఎనగంటి లాస్య,మరో ఐదు ఇళ్లు పూర్తి కావడంతో సర్పంచ్ జిన్న అనుష అనిల్ కుమార్, ఇందిరమ్మ ఈళ్ల కమిటీ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ. తమ సొంత ఇంటి కలలు నెరవేర్చిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ వాసం పెల్లి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రజిత,వార్డు సభ్యులు మొకనపెల్లి బాలరాజు, నరేష్ ఆనందం లక్మి, పద్మ, సమత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాగేందర్, రమ ,లావణ్య, మండల మహిళ సమైక్య అధ్యక్షురాలు భవిష్య, గ్రామ శాఖ అధ్యక్షులు చిత్రవేణి ప్రభాకర్, రాములు, కారోబార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాజ్యోతి కథనానికి స్పందన

## – రాయికల్ బైపాస్ రోడ్డులో గుంతలు పూడ్చివేత.. ప్రజల్లో హర్షం

**రాయికల్, జూన్ 04 ( ప్రజా జ్యోతి** రాయికల్ పట్టణంలోని బైపాస్ రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతల సమస్యపై ప్రజా జ్యోతి పత్రికలో వార్త ప్రచురితమైన వెంటనే సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. తాగునీటి పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్విన గుంతలను చాలా రోజులుగా పూడ్చకపోవడంతో వాహనదారులు,


ప్రజాజ్యోతి
03 jun 2026 - Page 13
**వారం రోజులుగా రోడ్డుపై గుంత..**
**- బైపాస్‌లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు**
రాయికల్, జూన్ 02 (ప్రజా జ్యోతి) రాయికల్ పట్టణంలోని బైపాస్ రోడ్డుపై తాగునీటి పైప్‌లైన్ మరమ్మత్తు పనుల కోసం తవ్విన గుంత వారం రోజులుగా అలాగే ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైప్‌లైన్ లీకేజీని సరిచేయడానికి అధికారులు రోడ్డును తవ్వినప్పటికీ, ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం అధిక రద్దీ ఉండే ఈ బైపాస్ రోడ్డుపై గుంత కారణ లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తు పనులను పూర్తి చేసి రోడ్డును యథావిధిగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా అలస్యం చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పత్రికలో కథనం వెలువడింది. ఈ కథనాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు



వెంటనే చర్యలు చేపట్టి గుంతలను మట్టితో నింపి రహదారిని సరిచేశారు. దీంతో రాకపోకలకు ఏర్పడిన ఇబ్బందులు తొలగిపోయాయి. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రమాదాల భయం తగ్గడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన ప్రజాజ్యోతి పత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన సంబంధిత శాఖ అధికారులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టిన వెంటనే రహదారులను పునరుద్ధరించాలని స్థానికులు కోరారు.

# తాటిపెల్లి జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ల కష్టాలు: తొలగించాలని స్థానికుల నిరసన..



**జగిత్యాల రూరల్, జూన్4(ప్రజాజ్యోతి).** జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపెల్లి గ్రామం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడటమే కాకుండా, చిన్నపాటి ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, వాహనదారులు స్పీడ్ బ్రేకర్లను గమనించక అకస్మాత్తుగా బ్రేకులు వేయడం వల్ల వెనుక వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. దీనివల్ల ప్రయాణికులు గాయాలపాలవుతున్నారుఇళ్ల సమీపంలో ఉండటం వల్ల వాహనాల రాకపోకల శబ్దం, దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. స్పీడ్ బ్రేకర్లను సరైన ప్రమాణాలతో నిర్మించకపోవడం వల్లే వాహనాలకు నష్టం వాటిల్లుతోందని వాహనదారులు చెబుతున్నారు. జాతీయ రహదారిపై భద్రత అవసరమే అయినప్పటికీ, శాస్త్రీయ పద్ధతిలో లేని స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత రహదారి భద్రతా అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి, ఈ స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని లేదా ప్రమాణాలు పాటించేలా ఆధునీకరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# పంట అవశేషాలు భూమిలో కలపండి

## – జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

**కొడిమ్యాల, జూన్ 04,(ప్రజాజ్యోతి):** పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం ద్వారా నేల సారవంతత పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ అన్నారు. ప్రజాపాలన ప్రత్యేక గ్రామసభలో భాగంగా గురువారం శ్రీరాములపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. రానున్న వానాకాలంలో ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాల నేపథ్యంలో పంటల మార్పిడిపై దృష్టి సారించాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సన్నరకాల వరి సాగు చేపట్టాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు వివరించారు. అనంతరం రైతు గోగూరి గోపాల్‌రెడ్డి పొలాన్ని సందర్శించి, వరి కొయ్యలను రోటవేటర్‌తో భూమిలో కలియదున్నిన విధానాన్ని పరిశీలించారు. పంట వ్యర్థాలకు నిప్పంటించడం వల్ల పర్యావరణంతో పాటు నేలలోని సూక్ష్మజీవులు కూడా నష్టపోతాయని పేర్కొన్నారు. గ్రామసభలో రైతులతో పంట అవశేషాలను కాల్చబోమని ప్రతిజ్ఞ చేయించారు. పంట వ్యర్థాలను తగులబెట్టిన రైతులపై జీవో–27 ప్రకారం గ్రామ పంచాయతీలు జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.



# జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ -- మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు



**రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో రెండు కిలక జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల భారతీయ జనతా పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్మూర్––జగిత్యాల––మంచిర్యాల జాతీయ రహదారి (ఎన్‌హెచ్––63), జగిత్యాల––కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్––563) సెక్షన్ల అభివృద్ధికి బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలపడంతో, ఈ ప్రాజెక్టుల ప్రారంభానికి అవసరమైన ప్రక్రియ పూర్తయిన సందర్భంగా బీజేపీ జిల్లా పార్టీ పిలుపు మేరకు రాయికల్ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు పార్టీ నాయకులు పాలాభిషేకం చేసి కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారుల అభివృద్ధి వల్ల జగిత్యాల జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు ఊతమిచ్చేలా ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, తెలంగాణలో కూడా జాతీయ రహదారుల విస్తరణకు పెద్దపీట వేస్తోందని వారు అన్నారు. ఈ నిర్ణయం వల్ల ప్రజల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రోడ్డు భద్రత కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, ప్రధాన కార్యదర్శి బండారి సాయిరాజ్, ఉపాధ్యక్షుడు వట్టిమల్ల శ్రీనివాస్, కిసాన్ మోర్చా నాయకుడు ఏనుగు ముత్యం రెడ్డి, ఎస్టీ మోర్చా నాయకుడు తిరుపతి నాయక్, సర్పంచులు పడాల తిరుపతి, వాకిటి గంగారెడ్డి, బూత్ అధ్యక్షులు శేఖర్, తిరుపతి, రవికిరణ్, భూమయ్య, తిరుమల్, సీనియర్ నాయకులు గంగారెడ్డి, నరసయ్య, గంగాధర్ నాయక్, సుమన్, పరశురామ్, మల్లేశ్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన మనస్వినికి ఘన సత్కారం



**ధర్మారం, జూన్ 4(ప్రజాజ్యోతి న్యూస్)** :ధర్మారం మండలంలోని పత్తిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బైరి మనస్విని ప్రతిష్టాత్మక త్రిబుల్ ఐటీలో ప్రవేశానికి ఎంపిక కావడంతో గ్రామంలో సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మనస్విని 600 మార్కులకు గాను 570 మార్కులు సాధించి,ధర్మారం మండల స్థాయిలో ప్రథమ స్థానం దక్కించుకుంది. ఆమె ప్రతిభకు గుర్తింపుగా గ్రామ సర్పంచ్ మాందాల శ్రావణి హరీష్,ఉపసర్పంచ్ పూసాల మల్లేశం,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరిత,ఉపా ధ్యా య బృందం కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ,మనస్విని సాధించిన విజయం ఆమె కష్టపడి చదవడం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా కృషి,పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఆమె నిరూపించిందన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి, పాఠశాలకు,గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# మద్యం మత్తులో ఘర్షణ..

## – ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

ధర్మారం,జూన్ 4(ప్రజాజ్యోతి న్యూస్):ధర్మారం మండలంలోని నంది మేడారం పంపు హౌస్‌లో పనిచేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య మద్యం మత్తులో జరిగిన ఘర్షణ విషాదానికి దారితీసింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ధర్మారం ఎస్సై ఎ. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, జార్ఖండ్ రాష్ట్రంలోని గుమ్లా జిల్లాకు చెందిన రాందేవ్ సింగ్ (50), నంది మేడారం పంపు హౌస్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన కైలాష్ గోప్ (30)తో కలిసి జూన్ 3న బయటకు వెళ్లి మద్యం సేవించారు. ఈ సందర్భంగా వారిద్దరి మధ్య వివాదం చోటుచేసుకుంది. అదే రోజు రాత్రి సుమారు 8.45 గంటల సమయంలో రాందేవ్ సింగ్ తన గదిలో బల్లపై పడుకుని ఉండగా, మద్యం సేవించే సమయంలో జరిగిన గొడవను మనసులో పెట్టుకున్న కైలాష్ గోప్ ఇనుప పైపుతో అతని తలపై బలంగా దాడి చేశాడు. ఈ దాడిలో రాందేవ్ సింగ్ తలకు తీవ్ర రక్తగాయం అయింది. అనంతరం జరిగిన ఘటనతో భయాందోళనకు గురైన కైలాష్ గోప్, అక్కడే ఉన్న కత్తిని తీసుకుని సమీపంలోని చెట్ల వైపు వెళ్లి తన గొంతును కోసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనను గమనించిన తోటి కార్మికులు తీవ్ర గాయాలతో ఉన్న ఇద్దరినీ వెంటనే ఆసుపత్రికి తరలించారు. కరీంనగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కైలాష్ గోప్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మరోవైపు రాందేవ్ సింగ్ తీవ్ర గాయాలతో అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విషమ పరిస్థితిలో ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# ధర్మారం మండలంలో నాలుగు పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం,జూన్ 4(ప్రజాజ్యోతి న్యూస్):ధర్మారం మండలంలోని రచ్చపల్లి, ఖానంపల్లి,ధర్మారం, కటికనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా ప్రారంభించనున్న ప్రీ-ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026-27 విద్యా సంవత్సరంలో ఈ నాలుగు పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్న నేపథ్యంలో 10 నెలల కాలపరిమితికి గాను గౌరవ వేతనంతో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమించనున్నట్లు పేర్కొన్నారు. ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (10+2) లేదా దానికి సమానమైన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలని, ప్రారంభ బాల్య విద్య (ఇసిసిఇ) లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు నోటిఫికేషన్ తేదీ నాటికి 18 నుండి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు,మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుందని వివరించారు. ఎంపిక ప్రక్రియలో స్థానికతకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ముందుగా అదే హాబిటేషన్‌కు చెందిన అభ్యర్థులకు,అనంతరం అదే గ్రామ పంచాయితీ,మండలం, జిల్లా పరిధిలోని అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాల ప్రతులతో కూడిన దరఖాస్తులను సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు ఈ నెల 9వ తేదీలోగా సమర్పించాలని ఎంఈఓ ప్రభాకర్ సూచించారు. పోస్టులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లేదా పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని కోరారు.

# పంచాయతీలే లక్ష్యంగా దొంగతనాలు: అంతర్జాల పరికరాల ముఠా గుట్టురట్టు




జగిత్యాల రూరల్ జూన్ 04 (ప్రజా జ్యోతి): గ్రామ పంచాయతి కార్యాలయాలే లక్ష్యంగా అంతర్జాల (టి-ఫైబర్) పరికరాల దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను జగిత్యాల రూరల్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ. 4.52 లక్షల విలువైన 39 విద్యుత్ నిల్వ ఘటాలు (బ్యాటరీలు), 4 నిరంతర విద్యుత్ సరఫరా సాధనాలు (యూపీఎస్‌లు), మరియు చోరీకి ఉపయోగించిన ఒక ప్రయాణీకుల ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసు అధికారి సుధాకర్ తెలిపారు. ధరూర్ గ్రామ శివారులో గురువారం ఉదయం పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో ఆటోలో అనుమానాస్పదంగా పరికరాలను తరలిస్తూ ఈ ముఠా దొరికిపోయింది. నిందితులంతా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండ అంజయ్య (36), మండలి రవి (49), చెమెల్ల నరేష్ (38)లుగా గుర్తింపు పొందారు. పాత ఉద్యోగే సూత్రధారి: ప్రధాన నిందితుడు బండ అంజయ్య గతంలో దే సంస్థలో సాంకేతిక సిబ్బందిగా పనిచేసి మానేశాడు. అక్కడ ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో సులభంగా డబ్బు సంపాదించవచ్చనే దురాశతో తన స్నేహితులను కూడగట్టాడు. గత నెల రోజులుగా వీరు ధర్మారం, లక్ష్మీపూర్, తిమ్మాపూర్, కల్లెడ, సంగంపల్లి, హన్మాజీపేట, అనంతారం, గుల్రాజ్‌పల్లి, అంతర్గాం, గొల్లపల్లి తదితర గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల తాళాలు పగలగొట్టి ఈ దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.



# నేషనల్ హైవేకు రు.2500 కోట్ల నిధుల మంజూరుపై హర్షం



చొప్పదండి, జూన్ 4 (ప్రజాజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన కరీంనగర్ – జగిత్యాల జాతీయ రహదారి రహదారిగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం రు. 2500 కోట్ల నిధులను మంజూరు చేయడం పట్ల చొప్పదండి మండల బిజెపి నాయకుడు తాడూరు శివకృష్ణ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కరీంనగర్ టూ జగిత్యాల నేషనల్ హైవే విస్తరణను సాంక్షన్ చేయడం ఉమ్మడి జిల్లా ప్రజలకు ఒక గొప్ప వరం అన్నారు. ప్రాజెక్టు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండి సంజయ్ కుమార్ కు జిల్లా ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రవాణా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవ, పట్టుదల వల్లే ఈ రోజు కరీంనగర్ – జగిత్యాల నేషనల్ హైవే విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్టుకు బీజం పడటం బండి సంజయ్ సాధించిన విజయమని స్పష్టం చేశారు. ? ఉత్తర తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ, ఈ ప్రాంత రోడ్డు ప్రమాదాల నివారణకు, సులభతర ప్రయాణానికి అత్యంత కీలకమైన 58. 8 కిలోమీటర్ల మేర సాగే కరీంనగర్-జగిత్యాల ఫోర్-లేన్ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినందుకు ప్రధాని మోదీ, నితిన్ గడ్కరీలకు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ టూ హన్మకొండ రహదారి ఏవిధంగానైతే పూర్తైందో అదే విధంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కూమార్ నాయకత్వంలో త్వరలోనే కరీంనగర్ టూ జగిత్యాల నేషనల్ హైవే పనులు పూర్తైతాయని అన్నారు. ఈ జాతీయ రహదారి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే కరీంనగర్ నుండి కొండగట్టు మీదుగా జగిత్యాల ప్రయాణించే వాహనదారుల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు ప్రమాదాలు నివారించబడుతాయని అన్నారు. అంతేకాకుండా కరీంనగర్ టూ జగిత్యాల నేషనల్ హైవే నాగ్ పూర్ హైవే కు కలవడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ప్రయాణం సులభతరం అవుతుందని తెలిపారు. ఈ రహదారి ద్వారా పరిశ్రమలు, వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రాంతీయ ప్రగతి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంత గొప్ప ప్రాజెక్టుకు మంజూరు ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులునితిన్ గడ్కరీ, బండి సంజయ్ కుమార్ కు కరీంనగర్ ప్రజల పక్షాన మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# పల్లిమక్త పంచాయతీ కార్యదర్శిని సన్మానించిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు.

కోనరావుపేట, జూన్.4(ప్రజాజ్యోతి) కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి ఇటీవలే బదిలీపై విచ్చేసిన గ్రామపంచాయతీ కార్యదర్శి రజిత, ను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులతో కలిసి స్వాగతం పలికి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంలో కార్యదర్శి కీలకపాత్ర పోషించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలకు మెరుగైన సేవలు అందించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయిని ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ వాసం పెల్లి శ్రీనివాస్, వార్డు సభ్యులు మహిళ సమైక్య మండల అధ్యక్షురాలు భవిష్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభలు పాల్గొన్న చైర్మన్, పుల్కాం రాజు

**–14, 15, 25 వార్డుల్లో పట్టణ ప్రగతి సభలు..**

**ప్రజాసమస్యల తక్షణ పరిష్కారానికి చైర్మన్ భరోసా**

**–18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకుఇందిరమ్మ చీరల పంపిణీ**



**వేములవాడ,జూన్,4:ప్రజాజ్యోతి** రాబోయే వర్షాకాలంపై మున్సిపల్ ముందస్తు అలర్ట్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి భూగర్భ జలాల పెంపునకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవాలి.. తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకే ఇవ్వండిమున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో త్వరలోనే ప్రత్యేక సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లు?ప్రజల ముంగిటకే 'ప్రజా పాలన': వార్డు సభల్లో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు, స్థానికులుమున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి: వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజురాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజల ఆరోగ్యం, వార్డుల సమగ్ర ప్రగతి కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో ఉత్సాహంగా సాగింది. ఇందులో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని 14, 15, 25వ వార్డుల్లో గురువారం ప్రత్యేక వార్డు సభలను ఏర్పాటు చేశారు. ఈ సభలకు మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వార్డు సభల్లో మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ముంగిటకే పాలనను అందించాలనే సత్సంకల్పంతో ఈ ప్రగతి ప్రణాళికను రూపొందించిందని పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో పట్టణంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక జ్వరాలు ప్రబలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వార్డు ప్రజలకు సుదీర్ఘమైన అవగాహన కల్పించారు. దోమల నివారణకు, అంటువ్యాధులు వ్యాపించకుండా ఉండటానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు ఇంటి పరిసర ప్రాంతాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడపడుచుకు ఇందిరమ్మ చీరలను ఇదే కార్యక్రమంలో పంపిణీ చేయడం జరుగుతుందని చైర్మన్ తెలిపారు. ఇంతకుముందు కేవలం మహిళా సంఘం లో ఉన్నటువంటి మహిళలకు మాత్రమే చీరలను పంపిణీ చేశారని కానీ ప్రస్తుతం దానిని సవరించి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ?పట్టణ పరిశుభ్రతలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరుతూ... ఇండ్ల నుంచి వచ్చే చెత్తను ఇష్టానుసారంగా రోడ్లపై, ఖాళీ స్థలాలలో, మురికి కాలువలలో వేయవద్దని చైర్మన్ హితవు పలికారు. ఇళ్లలోనే తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా వర్గీకరించి, ప్రతిరోజూ ఉదయం వచ్చే మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకే అందించాలని విజ్ఞప్తి చేశారు. వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం ఆధ్వర్యంలో త్వరలోనే ప్రత్యేక సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని, డ్రైనేజీల క్లీనింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ వంటి చర్యలను మరింత ఉధృతం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణపై మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ తమ గృహాల ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి, భవిష్యత్తులో వేసవి కాలంలో కూడా నీటి కొరత రాకుండా ఉంటుందని, పరోక్షంగా సకాలంలో వర్షాలు కురవడానికి ఇవి ఎంతో దోహదపడతాయని వివరించారు. ?వార్డుల అభివృద్ధిపై స్థానికులకు పూర్తి భరోసా ఇస్తూ... వార్డు ప్రజలకు ఎలాంటి మౌలిక వసతుల సమస్యలు ఉన్నా, తాగునీరు, డ్రైనేజీ, వీధి దీపాల వంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే వార్డు అధికారుల దృష్టికి లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ పాల్గొని శాంతిభద్రతలు, వార్డు ప్రణాళికలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, మున్సిపల్ క్షేత్రస్థాయి సిబ్బంది, మెప్మా ఆర్పీలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఆయా వార్డుల మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని సభలను విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో ఇల్లంతకుంటలో తాగునీటి సమస్యలకు పరిష్కారం



**ఇల్లంతకుంట జూన్ 4(ప్రజజ్యోతి)** ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండే మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)తో పాటు 2వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించింది. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు, 2వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలను సర్పంచ్ మామిడి రాజు ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి రెండు ప్రాంత ాలకు బోర్‌వెల్‌లను మంజూరు చేయించారు. ఎమ్మెల్యే సహకారంతో కస్తూర్బా పాఠశాలలో బుధవారం, 2వ వార్డులో గురువారం బోర్‌వెల్ వేయించడం జరిగింది ఈ సందర్భంగా సర్పంచ్ మామిడి.రాజు మాట్లాడుతూ ప్రజలకు, విద్యార్థినులకు భవిష్యత్తులో కూడా ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమ స్యలను వెంటనే గుర్తించి పరిష్కరించిన ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనా రాయణ , సర్పంచ్ మామిడి.రాజు , వార్డు సభ్యుడు రేగుల కార్తిక్ స్థాని కులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాకం సుమన్, మామిడి శ్రీనివాస్, కునబోయిన రఘు, స్థానిక నాయకులు కొట్టె వెంకటి, దయ్యాల మహేష్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండోతో మానసికోల్లాసం.. విద్యార్థులకు కలర్ బెల్టుల ప్రధానోత్సవం



**కొనరావుపేట, జూన్.4(ప్రజా జ్యోతి)**తైక్వాండో ద్వారా విద్యార్థులకు మానసికోల్లాసం తో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవచ్చని మార్గదర్శి విద్యానికేతన్ కరస్పాండెంట్ చిరంజీవి సూచించారు. గురువారం కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలోని మార్గదర్శి విద్యానికేతన్ హై స్కూల్లో సన్రైస్ తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవులను సక్రమంగా వినియోగించుకుని తైక్వాండో నేర్చుకోవడంతోపాటు బెల్టులు, సర్టిఫికెట్లు పొందడం అభినందనీయమన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు ఆటలు కూడా అవసరమని, వారిని తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే మరింతగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు వస్తారన్నారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారు అన్నారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించేలా రాష్ట్ర స్థాయి జాతీయస్థాయిలో పాల్గొని ఈ ప్రాంతానికి ఖ్యాతి తీసుకురావాలన్నారు. అనంతరం 14 మంది విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ బొజ్జం మల్లేష్ యాదవ్, రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి, ఎగ్జామినర్ సంతోష్ కుమార్, రాజన్న సిరిసిల్ల జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, కోచ్ ఎం. శ్రీనివాస్, కోశాధికారి రాచకొండ విజయ్, కోచ్ లు దేవరాజు, శంకర్, మహేష్ లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య జిల్లా విద్యాధికారి రాము




**భీమారం జూన్ 4 ప్రజా జ్యోతి** ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సంస్కారం కూడా అందుతుందని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. భీమారం మండలం రంగాపూర్‌లో నిర్వహించిన జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు .ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం, 9 రకాల వస్తువులతో కూడిన కిట్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 26 ప్రీ–ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే బాసర ట్రిపుల్ ఐటీలో 126 మంది విద్యార్థులు సీట్లు సాధించడం ప్రభుత్వ పాఠశాలల విద్యా ప్రమాణాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులతో పాటు పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. పీఆర్‌టీయూటీఎస్ సహకారంతో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, విద్యాశాఖ అధికార ులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జగిత్యాల నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి రూ.100 కోట్లు సీఎం హామీ: ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**జగిత్యాల టౌన్, జూన్ 04 (ప్రజా జ్యోతి):** జగిత్యాల నియోజకవర్గ పరిధిలో రోడ్ల అభివృద్ధి, మరమ్మతు పనుల కోసం రూ.65 కోట్ల నిధులను తక్షణమే మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఉన్నతాధికారులను కోరారు. గురువారం హైదరాబాద్‌లో ఆర్ అండ్ బి శాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్, సీఈ వెంకటేశ్వరరావులను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు రోడ్ల దుస్థితిని వారికి వివరించి, నిధుల మంజూరుపై చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు ఈ నిధులను తక్షణమే విడుదల చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు. సీఎం, మంత్రి ఆదేశాల మేరకు నిధుల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**త్వరలోనే రూ.100 కోట్లతో రోడ్ల రూపురేఖలు మార్చుతాం:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. జగిత్యాల నియోజకవర్గంలో దాదాపు రూ.100 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులను చేపట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని వెల్లడించారు. గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం, అలాగే ప్రధాన రహదారుల వెడల్పు (వైడెనింగ్) పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. జగిత్యాల పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే లక్ష్యంగా ఈ పనులు వేగంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన అటవీ శాఖ



**రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి)** ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా రాయికల్ అటవీ కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అటవీ క్షేత్ర అధికారి టి. భూమేష్ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులకు పర్యావరణం, నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, వాటి వల్ల కలిగే పరిణామాలు, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల చైతన్యం పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా డిక్షనరీలు, ఎగ్జామ్ ప్యాడ్లు, కంపాస్ బాక్సులను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా అటవీ క్షేత్ర అధికారి టి. భూమేష్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, నీటి, వాయు కాలుష్యాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రకృతి సంపదను కాపాడడంలో ముందుండాలని, చెట్ల పెంపకం మరియు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, ఎఫ్ఎస్‌వో రత్నమ్మ, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్లు రమణారెడ్డి, రత్నాకర్, సంధ్య, కవిత, విజయ, ఇలియాజ్‌తో పాటు బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు

ఇది తెలంగాణకే గర్వకారణం...

కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై....!యే తెలంగాణ కా గౌరవ్ హై.... !!

స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై....

ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశంలో పూర్తి హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 4(ప్రజాజ్యోతి):-** కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై....యే తెలంగాణ కా గౌరవ్ హై.... (కరీంనగర్ చాలా వేగంగా ఒక గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తోంది. ఇది తెలంగాణ కే గర్వకారణం.) అని నగర మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషికేష్‌లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పై వ్యాఖ్యలు చేశారు. జూన్ 3 , నాలుగు తేదీల్లో ఋషికేష్ జరిగిన ఆల్ ఇండియా మేయర్స్ సమావేశాల్లో పాల్గొన్న కోలగాని శ్రీనివాస్ ముందుగా సమావేశంలో పాల్గొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి , రాష్ట్ర మంత్రులు , ఎంపీలు , సహచర మేయర్లు , అధికారులందరికీ నమస్కారాలు తెలియజేసి కరీంనగర్ స్మార్ట్ సిటీ , అర్బన్ డెవలప్మెంట్ గురించి హిందీలో తన ప్రసంగాన్ని కొనసాగించి అందర్నీ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై....(స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదు, ప్రజల జీవితాలను సులభతరం చేయడం. )అని అన్నారు. కరీంనగర్, తెలంగాణలోని ఒక ముఖ్యమైన ,వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, దీనిని కేంద్ర ప్రభుత్వ 'స్మార్ట్ సిటీ మిషన్' కింద ఎంపిక చేశారన్నారు. కరీంనగర్‌ను ఒక ఆధునిక నగరంగా మార్చడానికి అనేక పెద్ద మార్పులుజరుగుతున్నాయన్నారు నగరంలో స్మార్ట్ రోడ్లు, మంచి ఫుట్‌పాత్‌లు , డ్రైనేజీలు , నగరం మొత్తంలో సీసీటీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతను పెంచడానికి అనేక కార్యక్రమాలుజరుగుతున్నాయన్నారు. ప్రధానంగా కరీంనగర్‌లో

# బొమ్మరెడ్డిపల్లిలో గ్రామసభ నిర్వహణ..

## – ప్రభుత్వ ప్రత్యేక కార్యక్రమాలపై అవగాహన



**ధర్మారం,జూన్ 4(ప్రజాజ్యోతి న్యూస్):** ధర్మారం మండలంలోని బొమ్మరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దార రాజ్‌కుమార్ అధ్యక్షతన గురువారం గ్రామసభను నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం మరియు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామసభలో భాగంగా ఓటరు జాబితా సవరణకు సంబంధించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై రెవెన్యూ శాఖ అధికారులు వివరించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం పరిస్థితులు, రైతులు సాగు చేయాల్సిన పంటలు, వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు అందించారు. పంటలకు నీటి వినియోగం, సాగునీటి నిర్వహణపై ఇరిగేషన్ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో వంగిన విద్యుత్ స్తంభాలు, కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు, ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారానికి సంబంధించి విద్యుత్ శాఖ అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వడదెబ్బ నివారణ చర్యలు, వడదెబ్బ కారణంగా మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించే నష్టపరిహారం గురించి పోలీసు శాఖ అధికారులు వివరించారు. రాబోయే వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం, వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంకరి నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మానసరెడ్డి, వార్డు సభ్యులు, డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌కుమార్, ఏఎస్ఐ ఎం.డి.సబీర్, ఏఈలు సాయికిరణ్, సాయితేజ, లైన్‌మెన్ సతీష్, ఏఈఓ మధుకర్, హెచ్ఎం రాజేశం, హెల్త్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, గ్రామ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చిన కోమల్ల రాజు, సంకరి హరీశ్‌లను ఘనంగా సన్మానించారు. అలాగే "ఏక్ పెడ్ మాకే నామ్" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు.

## అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

**రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి)** రాయికల్ పట్టణానికి చెందిన ధనరేకుల రాజేష్ (37), వ్యవసాయం మరియు గొర్రెల పెంపకంలలో నష్టాలు, పెరిగిన అప్పుల భారం కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, రాజేష్ రెండేళ్ల క్రితం ఉపాధి కోసం విదేశాలకు వెళ్లినప్పటికీ అక్కడ సరైన పని దొరకక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత పెరిగాయి. అప్పుల ఒత్తిడితో తీవ్ర నిరాశకు లోనై మద్యానికి బానిసైనట్లు తెలిసింది. అప్పుల కారణంగా తాను చనిపోతానని తరచూ కుటుంబ సభ్యులతో చెప్పేవాడని వారు తెలిపారు. ఈ నెల 1వ తేదీ రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా భార్య, తల్లిదండ్రులు గమనించి అడ్డుకున్నారు. అయినప్పటికీ మనస్తాపం నుంచి బయటపడలేకపోయిన రాజేష్ జూన్ 3వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు నల్లని తాడుతో ఉరి వేసుకున్నాడు. ఆ సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంటి పైకప్పుపై నిద్రిస్తుండగా, రాజేష్ కిందికి వెళ్లడం గమనించిన భార్య లత అతడిని ప్రశ్నించేందుకు వెళ్లింది. అయితే అతడు గది లోకి వెళ్లి తలుపులు వేసుకోవడంతో కుటుంబ సభ్యులు తలుపులు తెరవాలని ఎంత ప్రయత్నించినా స్పందించలేదు. దీంతో కిటికీ అద్దాలు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా రాజేష్ ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య ధనరేకుల లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయికల్ ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

# ప్రజల చెంతకే పాలనను తీసుకురావడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశం

## – జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా,
## – ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక'లో ఘనంగా ప్రత్యేక వార్డుల సభ.



**కరీంనగర్ కార్పోరేషన్, జూన్ 4(ప్రజాజ్యోతి):**-తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజల కార్యచరణలో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో " ప్రత్యేక వార్డుల సభలు" ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 4 నుండి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు "ప్రతేక వార్డు సభలు జరగనున్నాయి. గురువారం మొదటి రోజు నగరంలోని చింతకుంట, కొత్తపల్లి, రేకుర్తి, సీతారాంపూర్, మల్కాపూర్, విద్యానగర్, పద్మానగర్, రాంనగర్ ప్రాంతాల పరిదిలో గల 14,15,16,17,18,19,20,21,22,23,24,25,46,47, 48 డివిజన్లకు సంబంధించి రేకుర్తి ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో " ప్రత్యేక వార్డుల సభ" జరిగింది. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంబంధిత డివిజన్ల కార్పోరేటర్ల సమక్షంలో వార్డుల వారిగా ప్రజల సమస్యలు వాటి పరిష్కారం, పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పై సభలో చర్చించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యలు, చేపట్టబోయే కార్యక్రమాల పై ప్రస్తావించారు. నగరపాలక సంస్థ లో ప్రధాన విభాగాలైన ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, సానిటేషన్ విభాగాల వారిగా చేపడుతున్న కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా సంబంధిత 15 డివిజన్లలో యూఐడీఎఫ్ స్కీంలో 15 కోట్ల రూపాయల నిధులతో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులతో పాటు ప్రస్తుతం 5 కోట్ల సాధారణ నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మాన్ సూన్ ప్రిపరేషన్, 6 లక్షల నిధులతో డీ సి స్టేషన్, కార్యక్రమాల పై వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో మొత్తం 15 డివిజన్లలో కోటి 50 లక్షలతో డివిజన్లకు 10 లక్షల చొప్పున నిధులు కేటాయించి అంతర్గత రోడ్లు,మరుగునీటి కాలువల అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. ?టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా భవన నిర్మాణ అనుమతుల మంజూరు, మస్టర్ ప్లాన్ అమలు, లే అవుట్ల పరిశీలన, అక్రమ నిర్మాణాల నియంత్రణ, రోడ్ల విస్తరణకు అవసరమైన ప్రణాళికలు రూపొందించడం, ప్రజా సౌకర్యాల పరిరక్షణ, ఇంకుడు గుంతలు, 2027 జనాభా గణన తదితర అంశాలను ప్రజలకు వివరించారు. పారిశుధ్య విభాగం ద్వారా వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, దోమల నివారణ చర్యలు, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వాహణా, 2026 నిబంధన ప్రకారం 4 విభాగాలుగా సెగ్రిగేషన్ ప్రక్రియ, ప్లాస్టిక్ నివారణ, డీఆర్ సీసీ, కంపోస్టు ల నిర్వహణ, తదితర విషయాల పై అవగాహన కల్పించారు. స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల యొక్క భాగస్వామ్యం పై వివరించారు. వార్డుల సభలో ప్రత్యేక కౌంటర్లు చేసి ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించారు. అనంతరం హరితోత్సవంలో భాగంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు రేకుర్తి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కార్పోరేటర్లతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ... ప్రజల చెంతకే పాలనను తీసుకురావడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ముఖ్య ఉద్దేశమన్నారు. డివిజన్ల వారీగా ప్రజా సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి వార్డుల సభల్లో చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. డివిజన్ల పరిశుభ్రత చాలా ముఖ్యం అన్నారు. కరీంనగర్ నగరాన్ని స్వచ్ఛ నగరంగా మార్చడంలో ప్రజలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. ఉత్పత్తి అయ్యే చెత్తను 4 పద్ధతిల్లో వేరు చేసి నగరపాలక సంస్థ కార్మికులకు అందించాలన్నారు. డివిజన్ల లో ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ సెంటర్లను వినియోగించుకోవాలని సూచించారు. నగరంలో జరుగుతున్న పెన్షన్ మ్యాపింగ్ లో ఆన్ లైన్ ఫొటో ఐడెంటిఫికేషన్ కేవైసీ తప్పక చేయించుకోవాలని పిలుపు నిచ్చారు. డివిజన్ల లో శిథిలావస్థలో ఉన్న గృహాల ను గుర్తించి తొలగించాలన్నారు. మీ ప్రాంతాల్లో పార్కుల స్థలాలను కాపాడుకుంటూ... పార్కులను అభివృద్ధి చేస్కోవాలని అన్నారు. డివిజన్ల వారిగా ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ సంధర్బంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ.... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో నగర వ్యాప్తంగా 99 రోజుల కార్యచరణలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్ల వారిగా అభివృద్ధి పనులు చేయడంతో పాటు ప్రజల కు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరుస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్య పనులను ప్రణాళిక బద్ధంగా అమలు చేస్తున్నామని తెలిపారు. మాన్ సూన్ పై ముదస్తు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. నగరంలోని డంపుయార్డు ప్రక్షాళన కోసం అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీంలో 80 కోట్లు కేటాయించామని తెలిపారు. త్వరలోనే డంపుయార్డు ను ప్రక్షాళన చేస్తామని తెలిపారు. ప్రజలు నగర పరిశుభ్రత పై దృష్టి పెట్టాలని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో నూతన పద్దతులను అవలంబించాలన్నారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తను 4 పద్దతుల్లో వేరు చేసి... స్వచ్ఛ నగరంగా మార్చడంలో బాగ స్వాములు కావాలనే వారు. ఇందిరమ్మ నివాస గృహాల పథకంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి... నివాస గృహాల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి విడుతలో 1300 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామన్నారు. రెండో విడిత వచ్చే 2 వేల ఇండ్ల కోసం ముందస్తు ప్రణాళిక చేశామన్నారు. రెండో విడుతలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం 500 నివాస గృహాలను గతంలో పూనాది లెవల్ లో ఆగిపోయిన వాటిని పరిగణలోకి తీస్కొని పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. పెన్షన్ కు సంబంధించిన ఫొటో ఐడెంటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్కోవాలని పిలుపు నిచ్చారు. 2027 జన గణన నగరంలో కొనసాగుతుందని.. ప్రతి ఒక్కరు జన గణన ప్రక్రియలో వివరాలను నమోదు చేస్కోవాలని పిలుపు నిచ్చారు. ఈ సంధర్బంగా డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ... 99 రోజల ప్రగతి ప్రణాళిక లో చాలా సమస్యలను మా పాలకవర్గం పరిష్కారం చేస్తున్నట్లు వివరించారు. డివిజన్ల వారిగా ఇంకా ఉన్న ప్రజల సమస్యల పరిష్కారం పై అధికారులు ప్రభుత్వానికి నివేధించాలని కోరారు. ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరిస్తేనే... చేపట్టే కార్యక్రమాల పై ప్రజలకు విశ్వాసం కలుగుతుందని తెలిపారు. ప్రతి సమస్యను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీస్కెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు సుధగోని మాధవి, పర్వతం మల్లేషం, గంట శ్రీనివాస్, వాసాల రమేష్, వరాల నర్సింగ్, ఒంటెల సత్యనారాయణ, కాంతాల జగన్ రెడ్డి, అదనపు కమీషనర్ ఆయాజ్, సువార్త, డిప్యూటీ కమీషనర్లు ఖాధర్ మొహియుద్దీన్, వేణు, పలు విభాల అధికారులు, డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.

## మహిళలతో కలిసి బోనమెత్తిన మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత





**జగిత్యాల రూరల్ జూన్ 04 (ప్రజా జ్యోతి):** జగిత్యాల రూరల్ మండలం మొరపెల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె స్థానిక మహిళలతో కలిసి బోనమెత్తి, పెద్దమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పునరుద్ధరించి, ముదిరాజుల ఆర్థికాభివృద్ధికి ఎంతో పాటుపడ్డారని గుర్తుచేశారు. ముదిరాజులు చేపల పెంపకం చేపట్టి, వాటిని మార్కెటింగ్ చేసుకోవడానికి వీలుగా సబ్సిడీపై వాహనాలను కూడా అందించినట్లు వివరించారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఈ పాలనలో ఏ ఒక్కవర్గం కూడా సంతోషంగా లేదని ఆమె విమర్శించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం: బోనాల పూజల అనంతరం మొరపెల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను ఆమె సందర్శించారు. ఇటీవలి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అయిల్నేని ఆనంద్ రావు, ఉప సర్పంచ్ గంగరాజం, మాజీ ఉప సర్పంచ్ ప్రకాష్, లింగారెడ్డి, రామ్ మోహన్, వార్డు సభ్యులు తిరుపతి రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే ముదిరాజ్ సంఘ సభ్యులు గంగాధర్, భూమయ్య, సజన్, శేఖర్, రాజు, నాయకులు దేవయ్య, తి రు పతి గౌడ్, సతీష్, అమరేందర్, రమేష్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## జూన్ 9న జాబ్ మేళా నిర్వహణ

### జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



**పెద్దపల్లి, ప్రతినిధి జూన్ - 04 ప్రజా జ్యోతి;**జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు జూన్ 9 మంగళ వారం రోజున జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో 30 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, లోన్ ఆఫీసర్, కస్టమర్ రిలేషన్ అసోసియేట్, పోస్టులు పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల్, హుజరాబాద్, జనగాం, నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, నర్సంపేట్ ,పరకాల, మహబూబాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, బోధన్, ఇచ్చోడా ఆర్మూర్, నిర్మల్, ప్రాంతాలలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హతలు ఇంటర్ ఆ పై పూర్తి చేసినవారు ఫ్రెష్, పని అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని, 19 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయస్సు ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 09 మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో పెద్దపల్లిలోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నెంబర్. 233, హాజరై తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ



రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి) రాయికల్ మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ పునుగోటి పవన్ రావు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర అబ్జర్వర్ మాధవి మరిపెల్లి, జిల్లా ఇంచార్జ్ చెర్లపల్లి అమర్‌దీప్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా జెండా పండుగను నిర్వహించడం ఎంతో గర్వకారణమని నాయకులు అన్నారు. యువత తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు నీలగిరి రాజేందర్, నందు నాయక్, ముహమ్మద్ ఇంతియాజ్, మాదాడి పురుషోత్తం రావు, శ్రీకర్, వొద్దినేని వెంకటేష్, రిజ్వాన్, సుజాత, యుగేందర్, రమేష్, రవీందర్ నాయక్, రవి, మ్యాక్ మారుతి, వేణు, వంశీ, నరేందర్, ప్రసాద్, ప్రదీప్, సునీల్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం తెలంగాణ నినాదాలతో, ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక



బోయినిపల్లి, జూన్ 4 (ప్రజా జ్యోతి) బోయినిపల్లి మండల కేంద్రంలో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా మార్చి 6 నుండి మార్చి 12 వరకు నిర్వహిస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద అనంతపల్లి, కోరెం, దుంద్రపల్లి, బుర్గుపల్లి, తడగొండ మరియు మల్కాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించబడినవి. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీఓ, ఎస్ఐ, ఏఈఓ, ఏపీఎం, సీడీపీఓ, ఏపీఓ, ఎంఈఓ, అటవీ శాఖ అధికారి, జీపీఓలు, కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామ పెద్దలు మరియు గ్రామ పంచాయతీ కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

**– చిన్నారుల సంక్షేమమే సమాజ అభివృద్ధికి పునాది :విప్ ఆది శ్రీనివాస్**





మేడిపల్లి జూన్ 4 ప్రజా జ్యోతి ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోరుమల్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, జల సంరక్షణ, వనమహోత్సవం, మహిళా భద్రత, రోడ్డు భద్రత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం మాచపూర్, కట్లకుంట గ్రామాల్లో రూ. 12 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించారు. చిన్నారుల విద్య, పోషణ, ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ సురక్షిత తాగునీటి సరఫరా, పారిశుధ్య చర్యలు, వ్యవసాయ రంగంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్, ఎంపీడీవో అంజుమ, తహసీల్దార్ మునీందర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక నూతన రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక



కరీంనగర్ టౌన్, జూన్ 4 (ప్రజాజ్యోతి ) అలియాబాద్‌లో రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, నాయకులు పాల్గొని రెడ్డి ఐక్యవేదిక భవిష్యత్ కార్యాచరణ, సామాజిక సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా నాగర్తి చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంది తిరుపతి రెడ్డి ఎన్నికయ్యారు. సహ అధ్యక్షులుగా పట్లోళ్ల నాగిరెడ్డి, పురుమాని లింగారెడ్డి ఎన్నిక కాగా, కార్యనిర్వాహక అధ్యక్షులుగా బండ గోపాల్ రెడ్డి, ఎలిమినేటి సుమన్ రెడ్డి, నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి, విరాటి దేవేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షులుగా పాండురంగా రెడ్డి, నేరెళ్ల భూమ్ రెడ్డి, పోద్దుటూరి నారాయణ రెడ్డి ఎన్నికయ్యారు. కోశాధికారిగా గుర్రం పాపిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా దోంగల బాపు రెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఏలేటి రాంరెడ్డి, సీహెచ్. కొండల్ రెడ్డి, రామమ్మగారి బాల్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా యెల్మకన్నె దశమంత రెడ్డి, కొప్పుల గంగారెడ్డి, ముఖ్య సలహాదారుగా గడ్డం రమేష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మావేశంలో ప్రసంగించిన వ్యవస్థాపక అధ్యక్షులు ఏనుగు సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, రెడ్డి ఐక్యవేదిక రాష్ట్రవ్యాప్తంగా సామాజిక ఐక్యత, విద్యా ప్రోత్సాహం, యువత అభివృద్ధి, సేవా కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సంస్థ ఆశయాలను ముందుకు తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన రాష్ట్ర అధ్యక్షులు నాగర్తి చంద్రారెడ్డి మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి ఐక్యవేదిక ను మరింత విస్తరించి ప్రతి జిల్లాలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ రెడ్ల ఐక్యత కోసం, అభివృద్ధి కోసం, కృషి చేస్తానని అన్నారు. ప్రధాన కార్యదర్శి సంది తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, రెడ్డి ఐక్యవేదిక లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి సభ్యుల సంక్షేమం, యువతకు అవకాశాల కల్పన, సామాజిక చైతన్య కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బోనాల సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్

**గుడి ఆవరణలో జమ్మి మొక్కనాటిన అడ్వకేట్ వేముల మనోహర్**



బోయినిపల్లి, జూన్ 4 (ప్రజా జ్యోతి) బోయినిపల్లి మండలం మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామ పోషమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా గుడి ఆవరణలో జమ్మి మొక్క నాటారు. అడ్వకేట్ వేముల మనోహర్ మాట్లాడుతూ, పోషమ్మ తల్లి గుడి వద్ద వేప, మామిడి, మోతుక చెట్లు తప్పనిసరిగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిందం రమేష్, మాజీ ఉపసర్పంచ్ కాసారపు శ్రీధర గౌడ్, వార్డు మెంబర్ బుర్ర రాజు, సింగరి రమేష్, దయ్యాల రాయమల్లు, అర్చకులు బూరుగుపల్లి రమేష్, నరేష్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ మెంబర్ కమల్ గౌడ్ ఉన్నారు.

# పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతమైన యూరాలజీ శస్త్రచికిత్సలు





**పెద్దపల్లి, ప్రతినిధి జూన్ 4 ప్రజా జ్యోతి;** పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండు శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కల్వచర్ల గ్రామానికి చెందిన 21 ఏళ్ల యువకుడు తీవ్రమైన కడుపునొప్పితో గురువారం జిల్లా ఆసుపత్రికి వచ్చాడు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో అతనికి మూత్రనాళంలో రాళ్లు (యూరెటరిక్ స్టోన్స్) ఉన్నట్లు నిర్ధారణ కావడంతో నిపుణులైన వైద్యుల బృందం విజయవంతంగా డీజే స్టెంట్ (ఐజీహ్‌వత్) అమర్చింది. అదేవిధంగా, కొలనూరు గ్రామానికి చెందిన 28 ఏళ్ల మహిళకు రెండు నెలల క్రితం మూత్రనాళ సమస్య కారణంగా ఆసుపత్రిలో డీజే స్టెంట్ అమర్చగా, గురువారం దానిని విజయవంతంగా తొలగించినట్లు వైద్యులు తెలిపారు. ఈ రెండు శస్త్రచికిత్సల్లో యూరాలజిస్ట్ డాక్టర్ సంతోష్ రెడ్డి, జనరల్ సర్జన్ డాక్టర్ రాము, అనస్థీషియా నిపుణురాలు డాక్టర్ కృష్ణవేణి పాల్గొన్నారు. శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందంతో పాటు ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశు కేంద్రం, 2డీ ఎకో సేవలు, ఆధునిక లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ సేవలు, రూట్ కెనాల్ చికిత్సలు ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు లేదా వారి బంధువులు పారిశుధ్యం, వాష్‌రూమ్‌ల శుభ్రత, ఇతర సేవలకు సంబంధించి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా లేదా ఏవైనా సమస్యలు ఎదురైనా నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా నేరుగా సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్‌లో కూడా నమోదు చేయవచ్చని, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు .ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే అన్ని సేవలు పూర్తిగా ఉచితమని, ఎవరూ ఎలాంటి లంచాలు ఇవ్వవద్దని డాక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు.

# అయ్యా కలెక్టర్ గారు మేం పేద రైతులము మా మోర ఆలకించండి సార్..

**– దర్యాపూర్ భూముల సర్వేపై రైతుల ఆందోళన..**

**– 144,145 సర్వే నెంబర్లలో భూముల సర్వే నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి**

**ముత్తారం,జూన్ 04(ప్రజా జ్యోతి)** మండలంలోని దర్యాపూర్ గ్రామ శివారులో గల 144,145 సర్వే నెంబర్లలో భూముల సర్వే నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. గత 30 సంవత్సరాలుగా తాము ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రభుత్వం గతంలో పలుమార్లు రైతులకు పట్టాలు జారీ చేసిందని మేం సన్న చిన్న కారు రైతులము మాకు ఉన్న భూమితో వ్యవసాయం చేసుకుంటూ బ్రతుకుతున్న రైతులము మాకు న్యాయం చేయాలని కలెక్టర్ ను వినతి పత్రం ద్వారా కోరారు. అయితే ఇటీవల ముత్తారం తాసిల్దార్ మరోసారి భూముల సర్వే చేపట్టడం వల్ల రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. తమకు జీవనాధారమైన ఈ భూములను సర్వే పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దని, సాగు హక్కులను కాపాడాలని కోరారు. గతంలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో తీసుకున్నారని, ప్రస్తుతం మిగిలిన భూములపై కూడా అనిశ్చితి నెలకొనడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 144,145 సర్వే నెంబర్లలో భూముల సర్వేను వెంటనే నిలిపివేసి రైతుల హక్కులను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి,పిఎసిఎస్ మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి,మాజీ ఎంపీపీ ముత్తయ్య,మాజీ సర్పంచ్ నూనె కుమార్,శ్రీనివాస్ రైతులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలి

**– అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే,**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 4( ప్రజాజ్యోతి )** జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి, ప్రతి పాఠశాల వయస్సు గల బాలబాలిక ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తానాజీ వాకడే, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. బడిబయట ఉన్న పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రవ ాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలు, కాలనీలు, తండాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలికను ప్రథమ తరగతిలో చేర్పించడంతో పాటు, ట్రాన్సిషన్ తరగతులైన 5వ నుంచి 6వ తరగతి, 7వ నుంచి 8వ తరగతి, 10వ తంగతి అనంతర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పచ్చదనం, ఆకర్షణీయమైన వాతావరణంతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు సూచించారు. విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలని, పాఠశాల ఆవరణలను రంగురంగులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి గీత మాట్లాడుతూ బడిబాట కార్యక్రమ విజయవంతానికి గ్రామీణాభివృద్ధి శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామ స్థాయిలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, విద్యాశాఖతో సమన్వయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి జెడ్పి సీఈవో పవన్ కుమార్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ప్రసాద్, విద్యాశాఖ కోఆర్డినేటర్లు శ్రీనివాసు అశోక్ రెడ్డి శ్రీనివాస్ జిల్లా స్థాయి అధికారులు, సీడీపీఓలు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

# కోరుట్ల పేటలో బడిబాట



**ఎల్లారెడ్డిపేట మే 4 (ప్రజా జ్యోతి)** ఎల్లారెడ్డిపేట మండలంలోని కోరుట్ల పేటలో జెడ్పిహెచ్ఎస్ పిఎంసి బొప్పాపూర్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు బడిబాటను నిర్వహించారు .గ్రామంలోని 9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులను తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలు పంపించాలని విజ్ఞప్తి చేశారు .యుపిఎస్ కోరుట్ల పేట ఉపాధ్యాయులు గ్రామంలో బడిబాటలు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని ప్రైవేట్ పంపవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి, సత్యనారాయణ రామ్మోహన్, శ్రీనివాస్, బాలయ్య, భాస్కర్ రెడ్డి, భరత్, అక్బరుద్దీన్ ,చంద్రయ్య ఉపేందర్, దేవయ్య, ప్రశాంత్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తాడూరు గ్రామంలో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

**– ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



**తంగళ్ళపల్లి జూన్ 4 (ప్రజా జ్యోతి)** తంగళ్ళపల్లి మండలం తాడూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజల భాగస్వామ్యంతోనే సురక్షిత సమాజ నిర్మాణం సాధ్యమని ఆయన పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం చేయాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,ర్యాష్ డ్రైవింగ్,మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు బ్లాక్ స్పాట్స్ గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మహిళల భద్రత కోసం షీ టీమ్ సేవలు,భరోసా కేంద్రం సహాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ,సీఐ,ఎస్ఐలు,అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మండేపల్లి గ్రామంలో బూత్ అధ్యక్షుని కుటుంబాన్ని పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

**తంగళ్ళపల్లి జూన్ 4 (ప్రజా జ్యోతి)** మండేపల్లి గ్రామంలో బిఆర్ఎస్ బూత్ అధ్యక్షులు పెద్ది రాజు,పెద్ది రఘు,తండ్రి పెద్ది ఎల్లయ్య కుటుంబాన్ని బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్,మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య,సిరిసిల్ల పిఎసిఎస్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణ రెడ్డి,కందుకూరి రామగౌడ్,టౌన్ అధ్యక్షులు బండి జగన్, ఉప సర్పంచ్ అసాని శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గ్రామశాఖ అధ్యక్షులు నక్క రవి,రాగి పెల్లి కిష్టారెడ్డి,పోతారాజు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## తక్షణ సహాయం 5000/ నిత్య సరుకులు పంపిణీ.....

**– ఎల్లారెడ్డిపేట తాసిల్దార్ సుజాత....**



**ఎల్లారెడ్డిపేట జూన్ 4( ప్రజా జ్యోతి )**ఎల్లారెడ్డిపేట మండలంలోని బండలింగంపల్లి గ్రామంలో గత రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్ వల్ల ఇల్లు పూర్తిగా దగ్ధమైంది వారికి నిత్యవసర వస్తువులు సరుకులు బట్టలు వివిధ రకాల సామాగ్రి కాళీ బూడిదయింది ఈ విషయం మండల తాసిల్దార్ కు తెలియజేయగా కలెక్టర్కు నివేదిక ద్వారా తక్షణ సహాయంగా 5000 రూపాయలు నిత్యవసర సరుకులను ఎల్లారెడ్డిపేట మండల తాసిల్దార్ సుజాత గురువారం రోజు అందజేశారు. గ్రామ సర్పంచి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఎమ్మార్వో సుజాత మాట్లాడుతూ బాధితులకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నరసయ్య ,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ,గౌస్ గ్రామ సర్పంచ్ బాలరాజు నర్సా గౌడ్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి దొడ్డ గీతారాణి బాలాజీ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు..



**ముత్తారం జూన్, 04 (ప్రజా జ్యోతి)** మండలంలోని అడవి శ్రీరాంపూర్ తాజా మాజా ఎంపిటిసి దొడ్డ గీతారాణి సోదరుడు (మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ బావమరిది) ఎలిమిళ్ళ సమ్మయ్య హుజురాబాద్ లో మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేసిన మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు వాజిద్ పాషా, అడవి శ్రీరాంపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు దేశిని. రాజేశం. వార్డు సభ్యుడు వీరగోని అంజి మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు లక్కం ప్రభాకర్ గట్టు సదయ్య, అన వేన తిరుపతి, మారం వెంకన్న మరియు నాయకులు గట్టు రమేష్ తదితరులు పాల్గొన్నారు..

## పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు



**వీణవంక , జూన్ 4 ( ప్రజాజ్యోతి )** మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో పోతిరెడ్డిపల్లి గ్రామ చౌరస్తా వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీణవంక పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, తనుగుల గ్రామానికి చెందిన రేణుకుంట స్వర్ణకుమార్ ట్రాక్టర్‌ను నడుపుతూ ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడ్డాడు. ట్రాక్టర్ యజమాని కేశవపట్టణం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన దేవునిరి గోపిగా గుర్తించారు. ఇసుక రవాణాకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ఎండలతో అల్లాడిన ప్రజలకు వర్షం ఊరట

**– తొలకరి పలకరింపు.. రైతుల ముఖాల్లో చిరునవ్వులు**





**వీణవంక, జూన్ 4 (ప్రజాజ్యోతి)**కరీంనగర్ జిల్లా వీణవంక మండల ంలో గురువారం కురిసిన తొలకరి వర్షం ప్రజలకు, రైతులకు ఆనందాన్ని పంచింది. గత కొన్ని వారాలుగా మండలంలో భానుడు తన ప్రతాపాన్ని చూపుతూ తీవ్ర ఎండలు, ఉక్కపోతతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయగా, ఒక్కసారిగా కురిసిన వర్షం వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చింది. మధ్యాహ్నం నుంచి మేఘాలు కమ్ముకుని, అనంతరం కురిసిన జల్లులతో రహదారులు తడిసి ముద్దయ్యాయి. ఎండలతో అల్లాడిపోయిన ప్రజలు ఈ వర్షంతో ఊరట పొందారు. చిన్నారులు వర్షంలో తడుస్తూ సందడి చేయగా, పెద్దలు చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న రైతులకు ఈ వర్షం కొత్త ఆశలను నింపింది. పొలాల్లో తేమ పెరగడంతో దుక్కి పనులు ప్రారంభించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు తెలిపారు. ముఖ్యంగా వర్షాధార పంటల సాగు చేసే రైతులు ఈ వర్షాన్ని శుభసూచకంగా భావిస్తున్నారు. తీవ్రమైన ఎండల కారణంగా నీటి కొరత, విద్యుత్ వినియోగం పెరగడం వంటి సమస్యలు ఎదురవుతుండగా, ఈ వర్షం కారణంగా ఉష్ణోగ్రతలు తగ్గి ప్రజలు ఉపశమనం పొందారు. గ్రామాల్లోని చెట్లు, పంట పొలాలు వర్షపు నీటితో కళకళలాడగా, ప్రకృతి సరికొత్త అందాలను సంతరించుకుంది. మండల ప్రజలు, రైతులు రానున్న రోజుల్లో కూడా మంచి వర్షాలు కురిసి వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు నెలకొనాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తొలకరి జల్లులు మండల ప్రజల్లో ఆనందాన్ని నింపడంతో పాటు రైతుల ఆశల పల్లకిని ముందుకు నడిపిస్తున్నాయి.

## రహదారి గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులకు సీపీ ప్రశంసలు



**కరీంనగర్ క్రైం, జూన్ 04, ప్రజాజ్యోతి:** నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రమాదకరంగా మారిన రహదారి గుంతలను స్వయంగా పూడ్చి వాహనదారుల భద్రత కోసం కృషి చేసిన ట్రాఫిక్ ఆర్ఎస్ఐ ఎస్. శ్రీకాంత్‌తో పాటు ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని పలు ప్రధాన కూడళ్లు, రద్దీ రహదారులపై వర్షాల కారణంగా ఏర్పడిన గుంతలు వాహనదారులకు ఇబ్బందులు కలిగించడంతో పాటు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే స్పందించారు. సంబంధిత శాఖ చర్యలు తీసుకునే వరకు వేచి ఉండకుండా,ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలు సులభతరమవడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా గణనీయంగా తగ్గిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ విధులతో పాటు సామాజిక బాధ్యతగా ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా ట్రాఫిక్ సిబ్బంది చూపిన చొరవ ఆదర్శప్రాయమని అన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సేవా భావం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిబద్ధత, అప్రమత్తత, ప్రజల పట్ల బాధ్యతాయుత వైఖరిని ప్రదర్శించిన ఆర్ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు సిబ్బందిని ఆయన అభినందించి, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

## ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక గ్రామ సభలతో ప్రజల్లో చైతన్యం



**రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రాయికల్ మండలంలోని శ్రీరాంనగర్, కుర్మపల్లి, జగన్నాథపూర్, ఖైరిగూడెం గ్రామాల్లో గురువారం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల ద్వారా గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. సభల్లో వర్షాకాలం ముందస్తు చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ నివారణ, జల సంరక్షణ, వన మహోత్సవం, పర్యావరణ పరిరక్షణ, సురక్షిత తాగునీటి సరఫరా, వాతావరణ మార్పుల ప్రభావం నేపథ్యంలో వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల భద్రత, రోడ్డు భద్రత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామాల అభివృద్ధి, పరిశుభ్రత, నీటి వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అధికారులు వివరించారు. అలాగే వర్షాకాలంలో సంభవించే సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి. చిరంజీవి, మండల రెవెన్యూ అధికారి నాగార్జున, మండల పంచాయతీ అధికారి కె. సుష్మ, వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

**: జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత**
**వినతులను పారదర్శకంగా పరిష్కరించి, సంక్షేమ పథకాలు అందేలా చూడాలి**
**రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలి**
**బీర్‌పూర్ మండలం తుంగూరు గ్రామసభ, పలు ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాల తనిఖీ**




**బీర్‌పూర్, జూన్ 04 (ప్రజా జ్యోతి):** కొనుగోలు కేంద్రాలలో రైతుల నుండి సేకరించిన వరి ధాన్యాన్ని ఏరోజుకారోజు మిల్లులకు తరలించేలా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత ఆదేశించారు. గురువారం ఆమె బీర్‌పూర్ మండల కేంద్రంతో పాటు మోతినగర్ గ్రామంలోని ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. అలాగే నరసింహులపల్లి, కందెనకుంట గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను కూడా ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కేంద్రాలలో హమాలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, లారీలను ఆలస్యం చేయకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి డాక్యుమెషన్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఎక్కడా పెండింగ్ ఉంచవద్దని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు సరైన సమాచారం అందించాలని లత పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అకాల వర్షాలు వచ్చే ముప్పు ఉన్నందున కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తార్పాలిన్లు తదితర ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

**99 రోజుల కార్యాచరణ వినతులను త్వరగా పరిష్కరించాలి**

అనంతరం బీర్‌పూర్ మండలం తుంగూరు గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామసభలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 99 రోజుల ప్రణాళికా కార్యక్రమాల్లో ప్రజల నుండి వచ్చిన వినతులను అత్యంత పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సంయుక్త తనిఖీలు మరియు గ్రామసభ కార్యక్రమంలో బీర్‌పూర్ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, సంబంధిత వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి సర్పంచ్ పరామర్శ

**మేడిపల్లి,జూన్ 4 ప్రజా జ్యోతి** మేడిపల్లి గ్రామానికి చెందిన కనికరపు అర్జయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ మాకిలి దాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులను అందజేసి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోపారపు అర్జున్, వార్డు సభ్యులు, ఉరుమడ్ల మహేష్, గాడిపెల్లి బాబుగౌడ్, ఆన్సర్, ప్రవీణ్, హరీష్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# రాయికల్‌లో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం

**రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి)**
రాయికల్ మున్సిపల్ పరిధిలోని 2, 3 వార్డుల్లో గురువారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. అనంతరం మహిళా సంఘ సభ్యులకు ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఈ కార్యక్రవ ంలో 3వ వార్డు కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్, మున్సిపల్ మేనేజర్ వెంకటి, వార్డుల ఇన్‌చార్జులు నరేష్, రాజ్‌కుమార్, మెప్మా ఆర్పీలు గాజంగి అనిత, తీగుళ్ల జయసుధ, అంగన్వాడీ టీచర్ సుజాత, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమ్మ దేవత కృపతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలి

**– మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్**



**కాల్వ శ్రీరాంపూర్ జూన్ 4 (ప్రజా జ్యోతి)** పెద్దమ్మ తల్లి దేవత కృపతో ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ ప్రత్యేక పూజలు చేపట్టారు. కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామంలో ముదిరాజ్ కురాస్తు లుపెద్దమ్మ తల్లి దేవత బోనాల జాతర కార్యక్రమాన్ని గురువారం రోజు నిర్వహించారు. డప్పు చప్పులతో శివసత్తుల పూనకాలతో బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేకుల జ్యోతి రఘు. ఉపసర్పంచ్ మేడి అశోక్.. మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి రహీంఖాన్. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాలువ వేమారెడ్డి .ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైమరీ పాఠశాలల్లో టీచర్, ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**జగిత్యాల రూరల్, జూన్ 4(ప్రజాజ్యోతి):** జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, చెల్-గల్, నర్సింగాపూర్ మరియు తక్కళ్ళపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రి-ప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం టీచర్, ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ మూలస్తం గంగాధర్ తెలిపారు. టీచర్ పోస్టుకు ఇంటర్మీడియట్ మరియు టీచర్ ట్రైనింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఆయా పోస్టుకు ఏడవ తరగతి పాసై ఉండాలి. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అర్హులైన అభ్యర్థులు మండల విద్యా వనరుల కేంద్రంలో జూన్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

# అనారోగ్యంతో విరక్తి చెంది బావిలో దూకి యువతి ఆత్మహత్య

**రాయికల్, జూన్ 04 (ప్రజా జ్యోతి)**
రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన పుట్ట దేవక్క (21), తండ్రి గంగారం, మాల సామాజిక వర్గానికి చెందిన యువతి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన చోటుచే సుకుంది. పోలీసుల వివరాల ప్రకారం, దేవక్క గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కలత చెందింది. ఈ క్రమంలో గ్రామ శివారులోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అటువైపు వెళ్లిన గ్రామస్తులు బావిలో మృతదేహాన్ని గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి వరుసకు కోడలైన మేదరి స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రాయికల్ ఏఎస్ఐ దేవేందర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.